సాక్షి
వికారాబాద్

గురువారం । 3 । అక్టోబర్ । 2024



యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

తాండూరు మండలం అంతారం గుట్ట వద్ద అసైన్డ్ భూమిలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. 10లో▸



ఉపాధి హామీ కూలీలకు వరం

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదలకు వరమని డీఎల్‌పీఓ శంకర్ నాయక్ అన్నారు. 10లో▸



బ్రహ్మోత్సవాలకు వేళాయె

ఆలంపల్లిలోని లక్ష్మీఅనంతపద్మనాభ స్వామి ఆలయంలో నేటి నుంచి దసరా బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 10లో▸

న్యూస్‌రీల్

నేడు ప్రమాణ స్వీకారం

తాండూరు రూరల్: మండలంలోని కొత్లాపూర్ శివారులో కొలువుదీరిన రేణుక ఎల్లమ్మ ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించనున్నారు. గ్రామానికి చెందిన నవీన్‌చంద్రారెడ్డి చైర్మన్‌గా, శాంతప్ప, లాలయ్య, లాల్యా నాయక్, రాజు, ఈశ్వరమ్మ, లక్ష్మి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి హాజరుకానున్నారు. ఇందు కోసం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు, పర్యవేక్షిస్తున్న డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: డీఎస్సీ ఎస్‌జీటీ అభ్యర్థుల జాబితా బుధవారం విడుదల కావడంతో అధికారులు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ప్రారంభించారు. 125మంది అభ్యర్థులు ధ్రువ పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. ఎస్‌జీటీ అభ్యర్థుల జాబితాను కలెక్టర్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ సాగుతుందని వివరించారు. అయితే రెండో రోజు(బుధవారం) జాబితా విడుదల కాలేదు. ఎస్‌ఏ, పండిట్, పీఈటీల లిస్టు రాలేదు. సాయంత్రం వరకు ఎదురు చూసిన అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగారు. గురువారం జాబితా వస్తుందని, అభ్యర్థులు వికారాబాద్ పరిధిలోని శివారెడ్డిపేట జెడ్పీహెచ్‌ఎస్‌కు ఉదయం 10.30గంటలకు చేరుకోవాలని డీఈఓ సూచించారు.

ధర్మనిధి పురస్కారానికి భాస్కరయోగి ఎంపిక



పరిగి: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మనిధి సాహితీ పురస్కారానికి పరిగి పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త, వక్త భాస్కరయోగి ఎంపికయ్యారు. ఈ నెల 4న నగరంలోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పురస్కారాలు అందజేస్తారు. పరిషత్తు అధ్యక్షుడు ఎలూరి శివారెడ్డి, ప్రముఖ సినీ నటుడు, సాహితీ వేత్త తనికెళ్ల భరణి చేతుల మీదుగా భాస్కరయోగి పురస్కారం అందుకోనున్నారు.

పనిచేసిన వారికే పదవులు

ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు



వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు అన్నారు. బుధవారం తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ మురుకుంట రాజేశ్వరశర్మ, ప్రధాన కార్యదర్శి రుద్రవీణ బాలసుబ్రమణ్యం, వక్కలంక శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు వేణుగోపాలరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వక్కలంక శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు పనిచేసిన వారికే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్, తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్‌లో పదవులు ఇవ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన వేణుగోపాలరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖా మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు.

'108' సిబ్బందికి సన్మానం

మొయినాబాద్: 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ అన్నారు. బుధవారం బాలాజీ ఆలయం వద్ద విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో 108 సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రాత్రి, పగలు తేడా లేకుండా ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే మంచి సేవలందిస్తున్నారన్నారు. ప్రజలకు సేవ చేసే సిబ్బందిని సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు నర్సింహాచారి, రవీందర్ చారి, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.



పరిగి: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

జాతిపితకు ఘన నివాళి

మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రధాన కూడళ్లలోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతి, అహింస బాపూజీ మార్గమని.. ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. పలుచోట్ల స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించారు.



అనంతగిరి: బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కలెక్టర్ ప్రతీక్‌జైన్



యూరప్ నుంచి జాతిపితకు నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

కొలిక్కి రాని బోర్‌వెల్

వాహనం పట్టుబడి నాలుగు రోజులైనా కేసులో కానరాని పురోగతి

- సూత్రధారులు, పాత్రధారులు ఎవరో తేలని వైనం
- పెద్దల ఒత్తిడి ఉన్నట్లు ఆరోపణలు
- నెలలో 45 బోరు బండ్లను అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం
- నగరం నుంచి ముంబై పోర్టుకు..
- అక్కడి నుంచి జాంబియా దేశానికి తరలిస్తున్న ముఠా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



నాలుగు రోజుల క్రితం పరిగి పోలీసులు స్వాధీనం చేసుకున్న బోర్‌వెల్ వాహనం

వికారాబాద్: బోర్‌వెల్ వాహనం అక్రమ రవాణాలో అన్నీ అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి పత్రాలు లేకుండా రాత్రి సమయంలో గుట్టుగా తరలిస్తున్న బోర్‌వెల్ వాహనాన్ని పరిగి పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. కేసు నమోదై నాలుగు రోజులు కావస్తున్నా ఎలాంటి పురోగతి కనిపించడంలేదు. నిగ్గు తేల్చే విషయంలో అటు పోలీసులు.. ఇటు ఆర్టీఏ అధికారులు ఒకరిపై ఒకరు నెట్టేసుకొని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో తయారు చేసిన బోర్‌వెల్ వాహనాలను అక్రమ మార్గంలో ఆఫ్రికా దేశాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ప్రతి నెలా 45 వాహనాలను చేరవేస్తున్నట్లు తెలిసింది. నంబర్ ప్లేట్ లేకుండా అడ్డదారిలో ముంబై పోర్టుకు అక్కడి నుంచి జాంబియా దేశానికి తరలిస్తున్నారు. పెద్దల అండదండలతో ఓ మాఫియా యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిసింది. ప్రతి నెలా పదుల సంఖ్యలో వాహనాలను విదేశాలకు తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది.

అన్నీ అనుమానాలే..

నెలలో 45 బోర్‌వెల్ వెహికల్స్‌ను తరలిస్తారని తెలుస్తుండగా వెళ్లిన ప్రతి సారీ వరుసగా మూడు వాహనాలు ఉంటాయని స్థానికులు అంటున్నారు. ముందుగా రెండు బోరు బండ్లు వెళ్లగా మూడో వాహనాన్ని పరిగి పోలీసులు పట్టుకున్నారు. అయితే ముందు వెళ్లిన రెండు వాహనాల గురించి కొడగంల్, బొంరాస్‌పేట పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గత నెల 28న వాహనం పట్టుబడగా 29న పోలీస్ స్టేషన్‌కు తరలించారని స్థానికులు తెలిపారు. పోలీసుల విచారణలో బోరు బండిని జాంబియా దేశానికి తరలిస్తున్నట్లు వెల్లడైంది. హైదరాబాద్ నుంచి హైవే మీదుగా ముంబై వెళితే పోలీసులు పట్టుకుంటారనే అనుమానంతో అడ్డదారిన పరిగి, షోలాపూర్ మీదుగా ముంబై పోర్టుకు తరలిస్తున్నట్లు తెలిసింది.

బోర్‌వెల్ వాహనం తయారు చేయాలంటే..

సాధారణంగా బోర్‌వెల్ వాహనాన్ని తయారు చేయాలంటే ముందుగా తయారీ కంపెనీ నుంచి షేషు కొనుగోలు చేసి దానిపై కంప్రెషర్ బిగించాలి. ఆ తరువాత మరో ఏజెన్సీతో బాడి తయారు చేయిస్తారు. ఈ సమయంలో ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించడంతో పాటు టీఆర్ నంబర్ పొందుతారు. టీఆర్ నంబర్ ఆన్‌లైన్ కూడా అవుతుంది. కానీ పట్టుబడిన వాహనానికి సంబంధించి కంప్రెషర్‌కు సంబంధించిన ఇన్‌వాయిస్ తప్ప ఏ పత్రాలు లేవు. అన్నీ సక్రమంగా చేస్తే ఒక్కో వాహనానికి విడిభాగాలకు సంబంధించి ప్రభుత్వానికి వెళ్లే జీఎస్టీ కాకుండా 14శాతం పన్ను చెల్లించాలి. బోర్‌వెల్ వాహన సామర్థ్యాన్ని బట్టి ఒక్కో వెహికల్ రూ.కోటి నుంచి రూ. 2కోట్ల వరకు ఉంటుంది. ఈ లెక్కన ప్రతి నెలా ఈ మార్గంలో అక్రమంగా తరలిస్తున్న 45 వాహనాలకు రూ.5 కోట్ల నుంచి రూ.6కోట్ల వరకు ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

పెద్దల సహకారంతోనే..

బోర్‌వెల్ వాహనాల అక్రమ తయారీ, తరలింపు మాఫియాకు పరిగి ప్రాంతానికి చెందిన ప్రధాన పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత అండదండలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా ఓ సారి పరిగిలో ఇలాంటి వాహనాన్ని పోలీసులు పట్టుకోగా ఆ పెద్ద మనిషి ఒత్తిడితో వదలి పెట్టినట్లు తెలిసింది. ఇలా సాయం చేసినందుకు ఆ పెద్ద మనిషికి ప్రతి నెలా కొంత ముట్టజెప్పాలనే ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. తాజాగా పట్టుబడిప సమయంలో కూడా కొందరు డీల్ కుదుర్చుకునేందుకు ప్రయత్నించగా విఫలం కావడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే వెహికల్ పట్టుబడి నాలుగు రోజులు గడిచినా కేసులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ఇందులో ఎవరి ప్రమేయం ఉంది..? ఎవరెవరి హస్తం ఉంది..? ప్రభుత్వానికి జరుగుతున్న నష్టం ఎంత..? లబ్ధి పొందుతున్నది ఎవరు? అనేది తేలాల్సి ఉంది. కేసును పూర్తిస్థాయిలో విచారిస్తే డొంక కదిలి అసలు విషయం బయటికి వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాల్సి ఉన్నందున ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల అధికారులతో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో ఒక అర్బన్ వార్డు, గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని డిజిటల్ కార్డుల తయారీకి సర్వే చేయాలని సూచించారు. ఇందుకోసం ఎంపిక చేసిన బృందాలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు అందుబాటులో ఉన్న సమయంలో సర్వే చేయాలని, ఇందుకోసం అంగన్‌వాడీ టీచర్ల సహకారం తీసుకోవాలన్నారు. కుటుంబం ఫొటో, పూర్తి వివరాలు సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓ వాసుచంద్ర, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి పాటుపడదాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

- మహాత్ముడి కలలను సాకారం చేద్దాం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కడ్తాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు హామీ

కడ్తాల్: దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు అన్న మహాత్ముడి కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పాటుపడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో దేశంలోని 750 ఆదర్శ గ్రామాల్లో, కడ్తాల్ కూడా ఎంపికైందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామ పెద్దలను సన్మానించినట్లు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ సుజాత నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాభివృద్ధి కోసం తమ అభిప్రాయాలు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ కడ్తాల్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజల కోరిక మేరకు కడ్తాల్ మండల కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, ట్రామాకేర్ సెంటర్, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ఫ్యూచర్ సిటీతో ఉపాధి అవకాశాలు

గ్రామ సమీపంలోనే ఫ్యూచర్‌సిటీ, ఫోర్త్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు కానుండటంతో మండలానికి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే తెలిపారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతానన్నారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక అధికారిణి పద్మకౌశిక్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న స్థానిక ప్రజల చైతన్యాన్ని అభినందించారు. గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజంటేషన్, షార్ట్ ఫిల్మ్ ద్వారా జీపీ అభివృద్ధి ప్రణాళికలు(జీపీడీపీ)పై వివరించడంతో పాటు, ఆరోగ్య, విద్య, పారిశుద్ధ్యం, ఉపాధిరంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వివరించారు. కార్యక్రమంలో 75 ఏళ్లు నిండిన సీనియర్ సిటీజన్స్‌ను, మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించారు. ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఏక్‌పేడ్ మాకే నామ్‌లో భాగంగా ఆలయ పరిసరాల్లో 75 మొక్కలు నాటారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ వరుణ్ తివారి, రిసర్చ్ డాక్టర్ కన్నయ్య, అధికారులు నిధిసింగ్, విద్యులత, తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ కార్యాలయ ప్రధాన అధికారి అనిల్‌కుమార్, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ ఎల్‌ఎన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, లింగం, దీపికారెడ్డి, ఆంజనేయులు, నర్సింహ, భిక్షపతి, మహేశ్, ఏపీఎం రాజేశ్వరి, జీపీ కార్యదర్శి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మత మార్పిడికి పాల్పడితే సహించం

హిందూవాహిని నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న హిందూవాహిని నేతలు

ఇబ్రహీంపట్నం: ప్రలోభాలకు గురిచేసి, మతమార్పిడిలకు పాల్పడాలని చూస్తే సహించేదిలేదని హిందూవాహిని నేతలు హెచ్చరించారు. పట్నంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వాహిని రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ విశ్వప్రసాద్, కో-కన్వీనర్ గురువయ్యలు మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థులను స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ప్రలోభాలకు గురిచేసి, మత మార్పిడిలకు ఓ క్రిస్టియన్ మిషనరీ సంస్థ పట్నంలో పాల్పడుతుందని ఆరోపించారు. విద్యాసంస్థలు, హాస్టల్స్ ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో విద్యార్థులను మచ్చిక చేసుకునేందుకు సంస్థ యత్నిస్తుందని పేర్కొన్నారు. కొన్ని కళాశాలల్లోని ఆ మతానికి చెందిన హెచ్‌ఓడీలు క్రైస్తవులుగా మారాలని, లేకుంటే ఇంటర్నల్ మార్కులు తగ్గించి ఫెయిల్ చేస్తామని విద్యార్థులను బెదరిస్తున్నట్లు ఆరోపించారు. మత మార్పిడిలకు పాల్పడుతున్న వారిని ప్రశ్నించిన కార్యకర్తలపై మిషనరీకి చెందిన వారు దాడులు చేశారని, అన్ని ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యకర్తల పైనే తప్పుడు కేసులు పెట్టాలని పట్నం పోలీసులపై మిషనరీ సంస్థ ఒత్తిడి తీసుకోస్తున్నట్లు తెలిసిందన్నారు. ఎవ్వరైనా స్వచ్ఛందంగా మతమార్పిడిలు చేయలన్నా కొన్ని నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. దళితులు మతం మారితే వారికి ఎస్సీ రిజర్వేషన్లు వర్తించవని, బీసీ కిందకు వస్తారని తెలిపారు. దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే హిందూవాహిని అక్రమ మత మార్పిడిలను తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాజ్యాంగానికి, చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రలోభపెట్టి మతమార్పిడిలకు పాల్పడితే చూస్తూ ఉరుకోదని హెచ్చరించారు. సమావేశంలో వాహిని ప్రచార కమిటీ నాయకులు శ్రీనివాస్, రాములు, ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ సంచాలకులు అంజన్‌రెడ్డి, వాహిని సభ్యులు అభిషేక్‌రెడ్డి, రోహిత్, వినయ్, శ్రీధర్, శివకుమార్ ఉన్నారు.

హస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం



దుద్యాల్: దసరా ఉత్సవాలకు ముస్తాబైన పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం





అనంతగిరి: వికారాబాద్‌లోని వైభవలక్ష్మి ఆలయంలో వెలిసిన అమ్మవారు

సర్వపాప హరణం దుర్గమ్మ దర్శనం

దసరా పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమవుతున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. తొమ్మిది రోజుల పాటు దుర్గమ్మ వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ప్రత్యేక అలంకరణ, నిత్యపూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీధుల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలను సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం


ఆన్‌లైన్ సభ్యత్వం నమోదు చేస్తున్న ఈశ్వరప్ప

కుల్కచర్ల: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ బీసీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. బుధవారం మండల పరిధి కుల్కచర్ల, పుట్టపహడ్ గ్రామాల్లో పార్టీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశం ప్రశాంతంగా ఉందని చెప్పారు. సంఘ విద్రోహశక్తులపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. యువత బీజేపీ సభ్యత్వం పొందేందుకు ఆసక్తి చూపుతున్నారని, తద్వారా పార్టీ మరింత బలపడనుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ మహిళామోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, ఓబీసీమోర్చా జిల్లా ఇన్‌చార్జి భానుప్రకాష్, సహ ఇన్‌చార్జి కుమార్, ఓబీసీ మోర్చా పరిగి అసెంబ్లీ కన్వీనర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు


ఘటనా స్థలంలో గ్రామస్తులు

తాండూరు రూరల్: మండల పరిధి అంతారం గ్రామ శివారులో జరీనా క్రషర్ మిషన్ నిర్వాహకులు నిర్మిస్తున్న ప్రహరీని గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, మాజీ ఎంపీటీసీ శాంతు, గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 58లో క్రషర్ మిషన్ కొనసాగుతుందని తెలిపారు. పక్కనే గ్రామంలోని దళితులకు కేటాయించిన భూమిలో క్రషర్ నిర్వాహకులు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారని పేర్కొన్నారు. వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని, సర్వే అనంతరం గోడ నిర్మించుకోవాలని కోరగా.. నిర్మాణ పనులు ఆపేశారని వెల్లడించారు. కోస్గి ఆశన్న, మొగులప్ప, శ్రీనివాస్, మాణిక్యం తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి


నోటీసు అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్

పరిగి: సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ అన్నారు. నేరాల నియంత్రణలో అవి కీలక భూమిక పోషిస్తున్నాయని పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని సీసీలు లేని దుకాణ దారులకు ఆయన నోటీసులు అందజేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. చోరీలు పెరుగుతున్నాయని, కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే వాటిని నియంత్రివచ్చునన్నారు. అసలైన నేరస్థులను గుర్తించేందుకు దోహదపడతాయని, తద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని వెల్లడించారు. దుకాణ సముదాయాలు, ఇళ్లల్లో సీసీలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- సెలవురోజున రెచ్చిపోయిన మాఫియా
- అభివృద్ధి పనుల పేరిట తరలింపు
- అభ్యంతరం వ్యక్తంచేసిన గ్రామస్తులు
- అనుమతి ఉందన్న నిర్వాహకులు..
- పత్రాలు చూపేందుకు ముఖం చాటేసిన వైనం


అంతారం శివారు అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకాలు

తాండూరు రూరల్: సెలవు రోజులు మట్టిమాఫియాకు కలిసి వస్తున్నాయి. ఇదే అదనుగా భావిస్తున్న దుండగులు యథేచ్ఛగా భారీ యంత్రాలతో మట్టిని తోడి, తరలిస్తూ.. సొమ్ముచేసుకుంటున్నారు. తాండూరు మండలం అంతారం గుట్ట వద్ద అసైన్డ్‌భూమిని గతంలో ప్రభుత్వం దళితులకు కేటాయించింది. కానీ ఈ భూమిలో కొందరు అక్రమార్కులు జోరుగా మట్టితవ్వకాలు చేపడుతున్నారు. తాండూరు–అంతారం డబుల్ రోడ్డుతో పాటు గాజీపూర్ వద్ద వంతెన పనులకు మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. మట్టిని తవ్వాలంటే రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఎలాంటి పర్మిషన్ లేకుండానే యంత్రాలతో ఇష్టానుసారంగా మట్టిని తవ్వి, వాహనాల్లో తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి పేరిట దోపిడీ

బుధవారం గాంధీ జయంతి కావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. సెలవు రోజున ఎలాంటి ఆటంకాలు ఉండవని భావించిన మట్టిదొంగలు.. విస్తృతంగా తవ్వకాలు చేపట్టారు. ఇది గమనించిన ప్రాంత ప్రజలు.. నిర్వాహకులను నిలదీశారు. దీంతో తమకు మట్టి తవ్వకాలకు అనుమతి ఉందని మాఫీయా పేర్కొన్నారని, దీంతో కాగితాలు చూపించాలని కోరగా.. ముఖం చాటేసినట్లు తెలిపారు. రోడ్డు, బిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే రెవెన్యూ, మైనింగ్ శాఖ అనుమతితో మట్టిని తవ్వి, ప్రభుత్వానికి రాయల్టీ కట్టాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి రుసుం చెల్లించకుండానే అభివృద్ధి పనుల పేరిట మట్టిని దోచేస్తున్నారని స్థానికులు మండిపడ్డారు.

అధికార పార్టీ అండదండ..

తాండూరు మండల పరిధి ఖాంజాపూర్, అంతారం గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో అభివృద్ధి పనులు దక్కించుకున్న నిర్మాణ దారులు.. యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండతోనే అక్రమార్కులు మట్టిని తోడేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పనులు నిలిపివేస్తాం



అంతారం గుట్ట అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకాలను గతంలోనే నిలిపేశాం. గాంధీ జయంతి సెలవు రోజున మళ్లీ మట్టిని తవ్విన విషయం మా దృష్టికి వచ్చింది. వాటిని వెంటనే అడ్డుకుంటాం. అవసరమైతే మైనింగ్ అధికారులతో కలిసి మట్టి తవ్వకాలు, తరలిస్తున్న వాహనాలకు జరిమానా విధిస్తాం. అభివృద్ధి పనులు అయినా.. ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. రాయల్టీ చెల్లించాలి.

–తారాసింగ్, తహసీల్దార్, తాండూరు

పని అక్కడ.. జీతం ఇక్కడ

- జీపీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి
- గ్రామస్తుల విన్నపం


ఇన్‌చార్జి కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దేముల్: పెద్దేముల్ మండలంలో జీతం తీసుకుంటూ.. పరిగి నియోజకవర్గంలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఉన్నతాధికారులకు అందజేయాలని కోరుతూ.. ఇన్‌చార్జి జీపీ కార్యదర్శి నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రాజకీయ పలుకుబడితో ఆరు నెలలుగా కార్యదర్శి భాస్కర్ మరోచోట ఉద్యోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత కార్యదర్శికి పూర్తిస్థాయి బాధ్యతలు ఇవ్వకుండా మండల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే భాస్కర్‌ను తొలగించి, గ్రామంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేయాలని, అదే సమయంలో శాశ్వత జీపీ కార్యదర్శిని నియమించాలని కోరారు. లేని పక్షంలో మండల కేంద్రంలో, కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. తాండూరు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కిషన్‌రావు, ఎల్లారెడ్డి, రవి శంకర్, రియాజ్, ఆనందం, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు మాజీ సభ్యులు నహీమ్, మల్లేశం, ఫయాజ్, అరవింద్, సత్తార్ ఖాన్‌సాబ్, గ్రామస్తులు ఉన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్

- కారుతో కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన యువకుడు
- బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన ప్రాణాపాయం


విద్యుత్ స్తంభానికి ఢీకొన్న కారు

పరిగి: మద్యం మత్తులో కారు నడిపి ఓ వ్యక్తి బీభత్సం సృష్టించాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి పరిగి టీచర్స్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుడైన శ్రీకాంత్ మద్యం మత్తులో కారును వేగంగా నడుపుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో భారీ శబ్దంతో స్తంభం రెండు ముక్కలై, కారుపై పడింది. విద్యుత్ తీగలు తెగి షార్ట్ సర్క్యూట్ కావడంతో కరెంటు పోయి చీకటి అలుముకుంది. ఉలిక్కి పడిన చుట్టుపక్కల వారు బయటకు వచ్చి చూడగా.. విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడి ఉండటాన్ని గమనించారు. వాహనంలోని రెండు బెలూన్స్ ఓపెన్ కావడంతో శ్రీకాంత్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతన్ని విచారించగా.. తాను కొద్ది మోతాదులో మద్యం తీసుకున్నానని తెలిపారు. కల్తీ మద్యం కారణంగానే ఇలా జరిగిందని చెప్పడం గమనార్హం. బ్రీత్ అనలైజర్‌తో పరీక్ష నిర్వహించిన అనంతరం సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పథకం.. పేదలకు వరం


జీపీ కార్మికులను సన్మానిస్తున్న డీఎల్‌పీఓ

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

పెద్దేముల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పేదలకు వరమని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మండల పరిధి మంబాపూర్, గాజీపూర్ తదితర గ్రామాల్లో జీపీ కార్మికులకు సన్మానించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. ఉపాధి పథకం ద్వారా కూలీలకు 26 రకాల పనులు కల్పిస్తున్నామని తెలిపారు. స్కీంను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. యువత మహాత్ముడి మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్, ఏపీఓ నర్సింహులు, ఉపాధి ఈసీ కష్ణ, టీఏ అంజయ్య, జీపీ కార్యదర్శి సంజీవ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనందం, మైపూస్, హర్షవర్ధన్‌రెడ్డి, మోహిద్, ముద్దప్ప, భీములు, బాలప్ప, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు


మాంసం వ్యాపారి నగేష్

నవాబుపేట: గాంధీ జయంతిన మేక మాంసం విక్రయించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి పూలపల్లి గేటు వద్ద శంకర్‌పల్లి మండలం సంకెపల్లి గ్రామానికి చెందిన నగేష్ మటన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 5 గంటలకు నగేష్ మేకలను కోసి, మాంసం విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని దుకాణాన్ని సీజ్ చేశారు. గాంధీ జయంతిన అనుమతి లేకుండా జీవాలను కోసి, మాంసం విక్రయించడం నేరమని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత


భీమప్పను అప్పగిస్తున్న ప్రవీణ్‌కుమార్

కొడంగల్: మతిస్థిమితం లేని వ్యక్తిని అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులు చేరదీసి, బుధవారం ఇంటికి చేర్చారు. మతిస్థిమితం లేకుండా రోడ్ల వెంట తిరుగుతున్న వృద్ధుడిని చెన్నారం గ్రామానికి చెందిన భీమప్పగా గుర్తించారు. అనంతరం అతడి కుమారుడిని పిలిపించి అప్పగించినట్లు ఫౌండేషన్ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఏటీఎంలలో డబ్బులు చోరీ చేయడానికి యత్నించిన దొంగలను ఆదిబట్ల పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల ఠాణా పరిధి నాదర్‌గుల్‌లో నివాసం ఉండే అజీమ్‌పాషా, అర్బాజ్ కురేసిలు ఇద్దరు బంధువులు. 15 రోజుల క్రితం ఇద్దరూ నాదర్‌గుల్‌లో కల్లు కంపౌండ్‌లో కల్లు తాగారు. అనంతరం ఏటీఎంలో చోరీకి యత్నించారు. గమనించిన పోలీసులు నిందితులిద్దరినీ పట్టుకున్నారు. వారి నుంచి బైక్, సుత్తి, సానం, ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి దొంగతనం జరగలేదని పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

1300 గ్రాములు స్వాధీనం

మీర్‌పేట: ఇద్దరు గంజాయి విక్రేతలను మీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నందనవనంకు చెందిన ఆటో డ్రైవర్ మనీష్ సింగ్(48), కూలీ పనులు చేసే మహమ్మద్ ఖలీల్(30)లు కొంత కాలంగా మంగళ్‌హాట్ సీతారాంపేటకు చెందిన ఆబేద్ బిన్‌ఖాలిద్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి, స్థానికంగా విక్రయిస్తున్నారు. బుధవారం గాయత్రినగర్ వద్ద మనీష్‌సింగ్, ఖలీల్‌లు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. వారిని అరెస్ట్ చేసి, 1300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు ఆబేద్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి


సమావేశంలో మాట్లాడుతున్న గోపి

బషీరాబాద్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రిగా రేవంత్ ఉన్నారని, నాటి డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, ఎక్మాయి మఠం గురువు శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, సంఘం వెంకటయ్య, అనిల్, జగదీశ్, ఆశప్ప, మహేశ్, నర్సింహులు, మోహన్, బాలకృష్ణ, అశోక్, పకీరప్ప, వీరేశం, మహిపాల్, బాలప్ప తలితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించండి


నిరసనకారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధర్నా చేసిన వ్యాపారులు

తాండూరు రూరల్: ధ్వంసమైన రోడ్డు వలన దుమ్ము, ధూళితో సతమతమవుతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం ఆందోళన చేపట్టారు. తాండూరు నుంచి గౌతపూర్ గ్రామానికి వేళ్లే మార్గంలో చంద్ర థియేటర్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి వెలువడి స్థానిక వ్యాపారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీనికి నిరసనగా.. స్థానిక పాలిషింగ్ యూనిట్ యజమానులు, దుకాణ నిర్వాహకులు రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహించారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, పట్టణ అధ్యక్షుడు హబిబ్ లాలు ధర్నా వద్దకు చేరుకొని నిరసన కారులను సముదాయించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, 15 రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించారు.

ఎమ్మెల్యే స్వగ్రామంలో మద్యపాన నిషేధం

తీర్మానం చేసిన గ్రామస్తులు



తీర్మాన పత్రంతో గ్రామస్తులు

దోమ: ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి స్వగ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం విధించారు. గ్రామస్తులందరూ ఏకగ్రీవ తీర్మానం చేయడంతో పంచాయతీ కార్యదర్శి నిర్ణయం తీసుకున్నారు. బుధవారం మండల పరిధి శివారెడ్డిపల్లి గ్రామంలో జీపీ కార్యదర్శి సాహెరబేగం ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. సభలో గ్రామస్తులంతా బెల్టు దుకాణాలను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బెల్ట్ షాపులను నిషేధించాలని తీర్మానించారు. గ్రామంలో ఎవరైనా బెల్ట్ దుకాణం నిర్వహిస్తే.. రూ.లక్ష జరిమాన వేయనున్నట్లు పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారికి రూ.10 వేలు బహుమతి, మద్యం కొన్నవారికి రూ.20 వేలు జరిమాన విధించనున్నట్లు జీపీ కార్యదర్శి తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

ఊరెళ్తున్నారా.. పీఎస్‌లో సమాచారం ఇవ్వండి

- సీఐ కాంతారెడ్డి



షాబాద్: దసరా పండుగకు సొంతూర్లకు వెళ్తున్నవారు జాగ్రత్తగా ఉండాలని, దొంగతనాల నివారణకు తప్పనిసరిగా పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలని సీఐ యాదయ్యగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఊరికి వెళ్తున్నవారు తొలుత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. డబ్బు, బంగారు ఆభరణాలు, విలువైన పత్రాలను బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్‌ను అమర్చుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అదే సమయంలో ఇరుగు పొరుగు వారికి.. కూడా సమాచారం ఇస్తే బాగుంటుందని తెలిపారు. మీ ఇంటికి వచ్చే, వెళ్లే దారులు, ఇంటి లోపల సీసీలను అమర్చుకుని, డీవీర్ కనపడకుండా రహస్య ప్రాంతంలో ఉంచాలని వివరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న యువకులు

డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి

తాండూరు టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ, దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్, మార్వాడీ యువమంచ్, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆపత్కాలంలో రక్తం ఇచ్చిన వారు దేవుడితో సమానమన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకురావాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, సంస్థలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. 54 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, బ్లడ్ బ్యాంకు ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్, లయన్స్‌క్లబ్, మార్వాడీ యువమంచ్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, వీరప్రసాద్, అనిల్ సార్డా, సచిన్ రాఠి, భానుకుమార్, పునీత్, సభ్యులు అసద్ అలీ, సల్లా దామోదర్, రంగారావు, ఓంప్రకాష్ సోమాని, అరుణ్ సార్డా, మన్మోహన్ సార్డా, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమి కబ్జాకు యత్నం

- జేసీబీతో ఫారెస్టు హద్దులు చెరిపివేత
- అడ్డుకున్న ఎఫ్‌ఎస్‌ఓ స్నేహశ్రీ


జేసీబీని అడ్డుకున్న ఎఫ్‌ఎస్‌ఓ స్నేహశ్రీ

బషీరాబాద్: అటవీ భూమి కబ్జాకు యత్నించిన ఓ రైతుకు ఫారెస్టు అధికారులు జరిమాన విధించారు. మండల పరిధి గొట్టిగకలాన్ అటవీ ప్రాంతంలోని సర్వే నంబర్ 36 పక్కన మంత్లాపూర్ రెవెన్యూ పరిధిలోకి వచ్చే సేవ్యానాయక్ పట్టాభూమి ఉంది. దీంతో.. సేవ్యానాయక్ తన పొలం పక్కన ఉన్న అటవీ హద్దులను బుధవారం జేసీబీతో చెరిపి, కబ్జాకు యత్నించాడు. విశ్వసనీయ సమాచారంతో ఫారెస్టు సెక్షన్ అధికారి స్నేహశ్రీ అక్కడికి చేరుకుని జేసీబీని సీజ్ చేశారు. అయితే తన పొలాన్ని చదును చేస్తూ పొరపాటున అటవీ భూమి హద్దులో చేశానని సదరు వ్యక్తి అధికారులకుచెప్పడంతో రూ.10వేల జరిమాన విధించి, జేసీబీని వదిలేశారు. ఎవరైనా రైతులు ఫారెస్టు భూముల్లో చెట్లు నరికినా, భూముల కాబ్జాకు యత్నించినా క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. మైల్వార్ ఫారెస్టు భూములపై నిరంతరంఉంచినట్లు పేర్కొన్నారు.

మహానేతపై వీరాభిమానం

పితృ అమావాస్య సందర్భంగా మరణించిన తన పెద్దల చిత్రపటాల పక్కనే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటో పెట్టి భక్తి ప్రపత్తులు చాటుకున్నాడు ఓ వీరాభిమాని. మండలంలోని అల్లిఖాన్‌పల్లికి చెందిన జయశంకర్‌గౌడ్‌కు వైఎస్సార్ అంటే ఎనలేని గౌరవం. చనిపోయిన తన కుటుంబ సభ్యులతో పాటు పితృ అమావాస్య రోజున వైఎస్ చిత్రపటానికి సైతం నైవేద్యం పెట్టి, నూతన వస్త్రాలు సమర్పించారు.

– దుద్యాల్


అల్లిఖాన్‌పల్లిలో వైఎస్సార్‌కు పితృ అమావాస్య నివాళి అర్పించిన అభిమాని జయశంకర్ గౌడ్

పట్టుబడిన మద్యం ధ్వంసం


మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆమనగల్లు: వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. ఆమనగల్లు ఠాణా పరిధి సుమారు 10 ఎక్సైజ్ కేసుల్లో రూ.42 వేల విలువైన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టుబడిన మద్యం బాటిళ్లను ఎస్‌ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది కలిసి ధ్వంసం చేశారు.